# జైహింద్

## -పుట్టగంటి గోపీకృష్ణ



### పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
### కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో
### బహుమతి పొందిన ఉత్తమ నవల
### (గత సంచిక తరువాయి)

**తన వలన తండ్రి** ఎన్ని బాధలు పడి ఉంటాడో తలచుకుంటే ఆమె కళ్లలో నీరు చిప్పిల్లుతున్నాయి. తనను తాను ఓదార్చుకున్న ఫ్లోరెన్స్ టవల్ లేకపోవటంతో బయటకు రాబోయింది. కానీ... బాత్‌రూమ్ తలుపు బయట నుండి గడి పెట్టి ఉండటంతో తెరచుకోలేదు. తలుపు మీద కొడితే, సోఫియా వచ్చి మాట్లాడింది. “నో యూజ్ ఫ్లోరెన్స్. ఆ తలుపులు నేను తెరవను. నువు వచ్చిన విషయం ఇప్పుడే అల్బర్టుకు కబురు చేశాను. అతను పోలీసులతో వస్తాడు. విమానాన్ని దొంగలించినందుకు నీ మీద ఇంకా క్రిమినల్ కేసులు ఉన్నాయి. నువ్వు మాకు చేసిన ద్రోహానికి మేము ఎంతగా బాధ పడ్డామో భగవంతుడికి తెలుసు. నిన్ను చట్టం నుండి కాపాడి మరొక తప్పు చేయదలచుకోలేదు...” అంది కఠినంగా.

ఫ్లోరెన్స్ హతాశురాలయింది. ఆదరిస్తాడనుకున్న తండ్రి దేశంలోనే లేడు. పైగా తన మీద అరెస్ట్ వారంటు కూడా ఉందంటున్నారు. ఇలా దొరికిపోయి జైలులో మగ్గే కంటే, తన మిత్రులతో కలిసి ఒక న్యాయమయిన పోరాటంలో పాల్గొని మరణించినా ఆనందమే అనుకుంది ఆమె.

ఎదురుగా వెంటిలేటర్ కనిపిస్తోంది. దానిలో నుండి మనిషి దూరటం అసాధ్యం అనిపిస్తోంది. కానీ, తనలాంటి సన్నటి మనిషికి అది అంత కష్టం కాకపోవచ్చు.

ఆ నిర్ణయం తీసుకున్న తరువాత అయిదు నిమిషాల వ్యవధిలో ఆమె వెంటిలేటర్ ద్వారా ఇంటి నుండి బయటకు వచ్చింది. మరో రెండు నిమిషాల్లో ఆ వీధి నుండి వెళ్ళి పోయింది.

ఆ తరువాత ఎప్పుడో పోలీసులతో సహా వచ్చిన అల్బర్ట్‌కి బాత్‌రూములో ఎవరూ కనపడ లేదు.

డోయాంగ్, ఫ్లేమింగోస్ జట్ల మధ్య ఫుట్‌బాల్ మ్యాచ్ జరుగుతోంది. ఆ రెండు జట్లకు నాగాలాండ్‌లో అభిమానుల ఆదరణ బాగా ఉంది. అందుకే ప్రేక్షకులు చాలామంది ఉన్నారు.

ఆట చూడటానికి వచ్చే ప్రేక్షకులు కూర్చోవటానికి ప్రత్యేకంగా ఏర్పాట్లేమీ లేవు. మైదానం చుట్టూ ఉన్న ఖాళీ స్థలంలో ఎవరికి వీలయిన స్థలం చూసి వాళ్లు కూర్చున్నారు.

డోల్మాకు ఆ ప్రదేశాలన్నీ కొట్టిన పిండి కాబట్టి మధుబాలని సరాసరి అక్కడకు తీసుకు వచ్చింది. వీరికి బాగా దూరంగా కాంచనమాల, చేవా వీరిని అనుసరించి వస్తున్నారు.

అచింత్ కోహిమాలో ఆజాద్ హింద్ ఫౌజ్ తరుపున పనిచేస్తున్న ఏజెంట్. అంతకు మించి అతను ఎలా ఉంటాడో మధుబాలకీ, డోల్మాకు కూడా తెలియదు. తెలిసిందల్లా ఒకటే! అతను ఒంటరిగా వస్తాడు. మెరూన్ కలర్ హ్యాట్ పెట్టుకుని ఉంటాడు. 'డోయాంగ్ జట్టు గెలుస్తుందనుకుంటున్నావా?' అని అడిగితే, 'ఫ్లేమింగోస్ జట్టు మాత్రం గెలవదు.' అని సమాధానం చెప్తాడు.

ఆట మొదలయింది. చూడటానికి వచ్చిన వాళ్ళ కేకలు, ఈలలతో పరిసరాలు ప్రతిధ్వనిస్తున్నాయి. ఒకసారి గ్రౌండు చుట్టూ తిరుగుతూ తమకు కావలసిన వ్యక్తి కోసం చూశారు మధుబాల, డోల్మాలు.

అదే సమయంలో బ్రిటిషు కౌంటర్ ఇంటెలిజెన్స్ వాళ్లు కూడా ప్రేక్షకులలో కలిసిపోయి ఉన్నారు. వారికి కోహిమాలో ఆజాద్ హింద్ ఫౌజు గూఢచారి ఒకడు ఉన్నాడని ఎప్పుడో తెలుసు. ఎవరన్నది తెలియదంతే! నిజం చెప్పాలంటే ఆ గూఢచారి ఆడో, మగో కూడా తెలియదు. ఇప్పుడు అతన్ని కలుసుకోవటానికి ఎవరో వస్తున్నారు. వారు ఇక్కడ కలుసుకోబోతున్నారు. ఈ సమాచారం మాత్రమే వారి దగ్గర ఉంది. విశాలంగా ఉన్న గ్రౌండు చుట్టూ కవర్ చేస్తూ ప్రతి యాభై గజాలకు ఇద్దరు చొప్పున నిలబడి చుట్టు ఉన్న ప్రేక్షకుల మీద ఒక కన్ను వేసి ఉంచారు.

మైదానానికి బయట ఒక వేప చెట్టు ఉంది. దాని కింద నీడ ఉంది. కానీ, అక్కడ నుంచుంటే ఆట బాగా కనపడటం లేదు. అందుకే అక్కడ ఎక్కువ మంది లేరు. ఆ చెట్టు నీడలో ఉన్న ఒక వ్యక్తి మెరూన్ కలర్ హ్యాట్ పెట్టుకుని ఉండటం గమనించింది డోల్మా.

నెమ్మదిగా మధుబాల, డోల్మా అటు నడిచారు. ఆట చూస్తున్నట్లు చూస్తూ నెమ్మదినెమ్మదిగా అతనికి చేరువగా జరిగారు. కొన్ని నిమిషాల తరువాత, "డోయాంగ్ జట్టు గెలుస్తుందనుకుంటున్నావా?" అని అతన్ని అడిగింది మధుబాల. ఆ మాటలకు ఉత్సుకతతో ఆమెను చూశాడు అచింత్. హెడ్‌క్వార్టర్ పంపుతున్న ఏజెంట్లు ఆడవాళ్లని అతను కూడా అనుకోలేదు. తన ఆశ్చర్యాన్ని అణచుకున్న అతను, "ఫ్లేమింగోస్ జట్టు మాత్రం గెలవదు" అని సమాధానం చెప్పాడు.

ఆ తరువాత కొన్ని నిమిషాలు ఆట చూస్తూ గడిపిన మధుబాల, "ఇక్కడ పరిస్థితి ఏమిటి? నిజంగా బ్రిటిషు దళాలు వెనక్కి వెళ్ళి పోతున్నాయా?" అని అడిగింది.

"అవును, వెళ్ళి పోతున్నాయి..."

"నీ కళ్లతో నువు చూశావా? ఎవరో చెప్తే విన్నావా?"

ఇగో హర్ట్ అయినట్లు మొహం పెట్టాడు అచింత్. "మరీ అంత తెలివి తక్కువ వాడిగా కనిపిస్తున్నానా? దీమాపూర్ వరకు వెళ్ళి సైనికులు రైలు ఎక్కి వెళ్లటం కన్ఫర్మ్ చేసుకున్నాను. అందులో ఎలాంటి అనుమానమూ లేదు..." అన్నాడతను.

వీరి సంభాషణ జరుగుతున్న సమయంలోనే, ప్రేక్షకుల్లో ఉన్న కౌంటర్ ఇంటెలిజెన్స్ వాళ్లలో ఒకడికి వీరి మీద అనుమానం వచ్చింది. అతను పక్కన ఉన్న తన సహచరుడి వైపు తిరిగి, "ఆ చెట్టు కింద ఉన్న ముగ్గురు మనుషులను చూశావా?" అని అడిగాడు.

పక్క వ్యక్తికి చెట్టు కింద ముగ్గురు ఎవరున్నారో ముందు కనపడలేదు. తరువాత, "ఒక మగ మనిషి, ఇద్దరు ఆడవాళ్లు ఉన్నారు. వారి సంగతా నువు చెప్పేది?" అన్నాడు.

"అవును."

"నీకు మతిపోయిందా? ఆడవాళ్ళు గూఢచారులుగా ఎక్కడన్నా ఉంటారా?"

"కథలు కథలుగా చెప్పుకుంటున్నారుగా... బోస్ సైన్యంలో ఆడవాళ్లు ఉన్నారని. సైన్యంలో ఉన్నపుడు, గూఢచారుల్లో ఉంటే తప్పేమిటి?"

పక్క వ్యక్తి ఏమీ మాట్లాడ లేదు.

"వాళ్లు ముగ్గురూ కలిసి రాలేదు. మగ వ్యక్తి ఎప్పటి నుండో చెట్టు కింద నిలబడి ఉన్నాడు. ఆ ఆడవాళ్లు తరువాత వచ్చారు. వారు కలుసుకున్నపుడు కూడా పరిచయం ఉన్నవారిలాగా అనిపించ లేదు. కానీ, ఇపుడు చూడు ఎంతసేపటి నుండి మాట్లాడుకుంటున్నారో?"

"ఏం చేద్దామంటావ్?"

"ఎంక్వయిరీ చేస్తే తప్పేం ఉంది? వాళ్లు ఎవరో ఏమిటో కనుక్కుందాం..." అంటూ వారి వైపు నడిచాడు అతను. రెండవ వ్యక్తి అతన్ని అనుసరించాడు.

కాంచనమాల, చేవా దూరంగా ఉండి జరుగుతోంది గమనిస్తున్నారు. ఇద్దరు మనుషులు ప్రేక్షకుల్లో నుండి విడివడి మధుబాల, డోల్మా ఉన్న వైపు నడుస్తునారు. చెట్టు కింద ఉన్న వారిని హెచ్చరించే ప్రయత్నం చేద్దామంటే వారు ఇటు వైపు చూడటం లేదు.

"మనం ఏదో ఒకటి చెయ్యాలి. లేకపోతే వారు ముగ్గురు ప్రమాదంలో పడతారు..." అంది కాంచనమాల.

ఈ లోపు మఫ్టీలో ఉన్న ఇద్దరు అచింత్‌ను చేరుకున్నారు.

హఠాత్తుగా వారిని చూసిన అచింత్ బృందం ఖంగు తిన్నా, ఆ విషయం మొహాల్లో చూపకుండా బింకంగా నిలబడ్డారు.

"ఎవరు మీరు?" అంటూ వారిని గద్దించాడు మఫ్టీలో ఉన్న ఇంటెలిజెన్స్ వ్యక్తి.

తను పనిచేసే బేకరీ పేరు చెప్పాడు అచింత్. తమ తెగ భాషలో మాట్లాడింది డోల్మా.

నీ సంగతి ఏమిటన్నట్లు ప్రశ్నార్థకంగా మధుబాల వైపు చూశారు వారు.

"అసలు మీరెవరు? మీకు మా వివరాలు ఎందుకు చెప్పాలి?" అంటూ ఎదురు దాడికి దిగింది ఆమె.

అయిదుగురి మధ్య వాగ్వాదం మొదలయింది.

ఇంతలో చెట్టు చాటు నుండి కెవ్వున ఇంకొకరి కేక వినిపించింది.

అందరు పరుగు పరుగున చెట్టు వెనుక వైపు వెళ్లారు. అక్కడ ఒక స్త్రీ కింద పడిపోయి ఉంది.

ఆమె ఎందుకు పడిపోయిందో కౌంటర్ ఇంటెలిజెన్స్ వారికి అర్థం కాలేదు.

పడిపోయిన స్త్రీ కాంచనమాల అని గుర్తుపట్టగానే, ఇదంతా తమని ఇరకాటం నుండి తప్పించటానికి తమ స్నేహితులు వేసిన ప్లాను అని మధుబాలకు అర్థం అయింది. ఆమెకు అర్థం కానిది ఒకటే... చేవా ఎక్కడ ఉంది అని.

ఒక వ్యక్తి పడిపోయిన స్త్రీని పరీక్షించటానికి కాంచనమాల మీదకు ఒంగాడు. మరొక వ్యక్తి మధుబాల పక్కనే నిలబడ్డాడు.

చెట్టు మీద నుండి చిరుతపులి దూకినట్లు దూకింది చేవా. సరిగ్గా మధుబాల పక్కన నిలబడిన వ్యక్తి వెనక్కి వచ్చి పడింది. అతను ఎలర్ట్ అవకముందే చేవా చేతిలోని చాకు అతని కంఠం మీద సర్రున కదిలింది. అతను రెండు చేతులతో కంఠాన్ని పట్టుకుని కింద కూలబడి పోయాడు.

కింద పడిపోయిన కాంచనమాల మీద వంగుని పరీక్షిస్తున్న రెండవ వ్యక్తి వెనుక వినపడిన అలికిడికి వెను తిరిగి చూశాడు. కింద పడి పోతున్న తన సహచరుడు కనిపించాడు. మెడ చుట్టూ బిగించి పట్టుకున్న అతని చేతి వేళ్ళ మధ్య నుండి రక్తం పొంగుకు వస్తోంది.

అతనికి సహాయం చేయటానికి లేవబోయాడు రెండవ వ్యక్తి. అప్పటిదాకా పడిపోయి ఉన్న కాంచనమాల లేచి కూర్చోవటం, ఆమె చేతిలో ఒక చాకు ప్రత్యక్షం కావటం ఒకే సమయంలో జరిగాయి. అతను పూర్తిగా లేవక ముందే వెనుక నుండి అతన్ని పట్టుకున్న కాంచనమాల, తన చేతిలోని కత్తితో అతని కంఠాన్ని కోసేసింది.

అప్పుడే ఒక జట్టు గోల్ చేసినట్లు ఉంది. చప్పట్లు, ఈలలతో మైదానం మొత్తం హోరెత్తిపోతోంది.

అచింత్ కింద పడిన ఇద్దరినీ చెట్టు పక్కన ఉన్న గుబుర్లలోకి లాగేశాడు. "ఇక్కడ ఏం జరిగిందో ఎవరూ గమనించక ముందే, మనం వెళ్ళిపోవాలి..." అని అతను అంటున్నాడో, లేదో చెట్టు చాటు నుండి మరొకరు బయటకు వచ్చారు.

ఆ వ్యక్తి మీద కూడా దాడి చేయబోయి ఆఖరి నిమిషంలో నిలువరించుకుంది చేవా. ఎందుకంటే ఎదురుగా ఉన్నది ఫ్లోరెన్స్.

"నేను వెనక్కి వచ్చాను. మళ్లీ మనం 'పాంచ్ పటాకా' అయ్యాం..." అంది ఫ్లోరెన్స్ నీళ్లు నిండిన కళ్లతో.

అందరూ ఆమెను గట్టిగా హత్తుకుని తమ మద్దతు తెలిపారు.

పాంచ్ పటాకాలోని అయిదుగురు సభ్యులు ప్రస్తుతం బేకరీ పైన ఉన్న అచింత్ గదిలో ఉన్నారు.

ఫ్లోరెన్స్ తనకు తన ఇంటి దగ్గర ఎదురయిన అనుభవం గురించి చెప్పింది.

"అయితే మీ నాన్న ఇక్కడ లేడా? పోనీ నువు కూడా ఇంగ్లండ్ వెళ్లవచ్చుగా" అంది చేవా.

"వెళ్లవచ్చు. కానీ, దానికి రెండు అడ్డంకులు ఉన్నాయి. మొదటిది డబ్బు. అది ఎలాగోలా సంపాదించుకున్నా, నా పాస్‌పోర్ట్ ఎక్కడ ఉందో నాకు తెలియదు. ఏ గవర్నమెంటు ఆఫీసుకు వెళ్ళి సహాయం అడగాలన్నా నా మీద ఉన్న క్రిమినల్ కేసు అడ్డు పడుతుంది. కాబట్టి ఇండియాకు స్వాతంత్రం వచ్చే వరకు నేను ఇంగ్లండు వెళ్లటం అసాధ్యం. అప్పటి వరకు నేనూ మీతోనే..." అంది ఫ్లోరెన్స్.

"మీరు ఎక్కువసేపు ఇక్కడ ఉండటం క్షేమం కాదు..." అన్నాడు అచింత్. మధ్యాహ్నం జరిగిన జంట హత్యల తరువాత పోలీసులు కూంబింగ్ చేస్తున్నారని అతనికి వార్త వచ్చింది. తనతో పాటు వీళ్లందరి క్షేమం గురించి అందుకే అతను భయపడుతున్నాడు.

"తెలుసు." అంది మధుబాల. "మేము పొద్దు పోయాక ఇక్కడ నుండి వెళ్ళిపోతాము..." అని అతనితో అంటూ తరువాత ఏం చేయాలో చర్చని మిగతా వారితో కొనసాగించింది.

"అచింత్ చెప్పే దాన్ని బట్టి మిలటరీ అంతా కలకత్తా వెళ్ళి పోతోంది. కలకత్తా నుండి వచ్చే నివేదికలు కూడా ఆ విషయాన్నే ధృవీకరిస్తున్నాయి..." అంది చేవా.

"కానీ ఇప్పటికీ మన సుభాస్ గారు దానిని నమ్మలేక పోతున్నారు. మనల్ని ఇంత దూరం పంపింది నూటికి నూరు శాతం ఖచ్చితమయిన సమాచారం సంపాదించుకు రమ్మని. మనం ఇక్కడ కూర్చుంటే ఇంతకంటే కొత్తగా తెలిసేది ఏమీ ఉండదు. కాబట్టి కలకత్తా వెళ్దాం. అక్కడ మన ఏజెంటు సంతోష్‌ని కలుసుకుందాం. అసలు మిలటరీ తరలింపు మర్మమేమిటో తెలుసుకుందాం..." అంది మధుబాల.

"ఈ రోజు ఫుట్‌బాల్ గ్రౌండులో జరిగిన జంట హత్యల తరువాత కోహిమా అల్లకల్లోలంగా మారింది. పోలీసులు ప్రతి ఇంటినీ వెతుకుతున్నారు..." తనకు తెలిసిన విషయం చెప్పాడు అచింత్.

"డోల్మాని ఇక్కడే ఉండనిద్దాం. లోకల్ భాష మాట్లాడుతుంది కాబట్టి ఎవరికీ అనుమానం రాదు. మిగిలిన నలుగురం కలకత్తా వెళ్దాం..." అంది కాంచనమాల.

“ఇక్కడ రేడియో ట్రాన్స్‌మిషన్ యూనిట్ ఉంది కాబట్టి ఇక్కడ నుండి సమాచారం మన హెడ్‌క్వార్టర్‌కి చేరవేయవచ్చు. కానీ, మన నలుగురం కలిసి సేకరించిన సమాచారం ఇక్కడకు చేరేదెలా?” అనుమానం వెలిబుచ్చింది ఫ్లోరెన్స్.

“దగ్గర్లో ఎక్కడయినా ఫోన్ ఉందా?”

“కింద బేకరీలో ఉంది. కానీ అలా ఓపెన్ లైనులో మాట్లాడటం క్షేమం కాదు, ప్రస్తుతం అన్ని ఫోన్ కాల్స్ నిఘా నీడలో ఉన్నాయి...” చెప్పాడు అచింత్. “మీరు సమాచారం చేరవేయటానికి ఒకే మార్గం ఉంది. కొద్దిగా ఇబ్బందికరమే, కానీ... క్షేమంగా సమాచారం చేర్చవచ్చు.”

“ఎలా?”

“పావురాల ద్వారా. నా దగ్గర శిక్షణ పొందిన పావురాలు ఉన్నాయి. వాటిలో రెండు ఇస్తాను. వాటిని ఎక్కడ ఎగురవేసినా అవి తిన్నగా ఇక్కడకు వచ్చేస్తాయి.” అన్నాడు.

అందరి దృష్టి డాబా మీద ఉన్న పావురాల గూడు మీద పడింది. అచింత్ సామర్థ్యం మీద వారి గౌరవం మరింత పెరిగింది.

“మేము నలుగురం కలకత్తా వెళ్లాలి... సురక్షితంగా వెళ్లాలంటే సరయిన మార్గం ఏది?” అంటూ అచింత్‌ని అడిగింది కాంచనమాల.

“దిమాపూర్ వెళ్లి రైలు ఎక్కవచ్చు. కానీ దీమాపూర్ రైల్వే స్టేషన్ పూర్తిగా మిలటరీ వాళ్ల ఆధీనంలో ఉంది. అసలు మామూలు ప్రయాణికుల రైళ్లు నడుస్తున్నాయో, లేదో కూడా అనుమానమే. పైగా నలుగురు ఒంటరి మహిళలు ప్రయాణం చేస్తుంటే అనుమానం కూడా వస్తుంది.”

“మరేం చేద్దాం?”

“షిల్లాంగ్ వెళ్లే లారీలు ఉంటాయి. 400 కిలోమీటర్ల దూరం ఉంటుంది. డబ్బులు ఇస్తే డ్రైవర్లు ఎక్కించుకుంటారు. ఒక రాత్రిలో మీరు షిల్లాంగ్ వెళ్లిపోతారు. అక్కడ నుండి కలకత్తాకు ఇలాగే ఏదో ఒక ప్రయాణ సాధనం చూసుకోవటమే...” చెప్పాడు అచింత్.

అంతకు మించి క్షేమకరమయిన మరో ఆలోచన ఎవరికీ రాకపోవటంతో దానినే అంతిమంగా అంగీకరించారు.

“అయితే డోల్మా ఇక్కడే ఉంటుంది. మిగిలిన నలుగురం ఈ రాత్రికి బయలుదేరి షిల్లాంగ్ వెళ్తాం. ఈ రోజు బుధవారం. శనివారం కలకత్తాలో మన ఏజెంటును కలుసుకుంటామని అచింత్ హెడ్‌క్వార్టర్‌కి మెసేజ్ ఇస్తాడు. అతనికి తోడుగా డోల్మా ఉంటుంది...” అంటూ సమావేశం ముగించారు.

ముందే అందిన డబ్బులు చూసుకుని లారీ డ్రైవర్ మరేమీ మాట్లాడలేదు. రాత్రి భోంచేసి బయలుదేరితే ఉదయానికి షిల్లాంగ్ వెళ్తామని చెప్పాడతను. తప్పనిసరి పరిస్థితుల్లో ఇరుక్కుని నలుగురు క్యాబిన్‌లోనే కూర్చున్నారు.

దాదాపు లారీ వంద కిలోమీటర్లు ప్రయాణించి ఉంటుంది. ఆ చీకటిలో దూరంగా పరిసరాలను ప్రకాశవంతం చేస్తున్న సన్నటి వెలుతురు కనిపించింది. చెట్లు అడ్డుగా ఉండటం వలన ఆ వెలుతురు ఏమిటో, ఎక్కడ నుండి వస్తుందో స్పష్టంగా కనపడటం లేదు. పైగా ఆ వెలుతురు వెలువడుతున్న ప్రదేశం రోడ్డుకు దూరంగా ఉంది.

"ఆ వెలుతురు ఏమిటి?" అని డ్రైవర్‌ని అడిగింది మధుబాల.

"తెలియదమ్మా!" అన్నాడతను.

"అదేంటి ఎప్పటి నుండో ఈ రోడ్డు మీద ప్రయాణం చేస్తూ ఉండి ఉంటావ్. అదేమిటో తెలియకుండా ఎలా ఉంటుంది?" మళ్లీ అంది ఆమె.

"ఇంతకు ముందు ఆ వెలుతురు లేదు. ఈ మధ్య అక్కడ ఏవో కట్టడాలు వెలిశాయి. హడావుడి పెరిగింది. కానీ అది ఏమిటో తెలియదు. ఒకసారి కుతూహలం కొద్దీ లారీ ఆపి అదేమిటో చూద్దామని అటు వెళ్లబోయాను. మిలటరీ వాళ్ళు పట్టుకుని వెనక్కి పంపించి వేశారు. వేరే డ్రైవర్లను అడిగితే వారికీ ఇదే అనుభవం ఎదురయిందని చెప్పారు..."

"మిలటరీ వాళ్లా?" ఆశ్చర్యంగా అడిగింది చేవా.

"అవును. బోలెడన్ని మిలటరీ వాహనాలు అటు వైపు వెళ్లటం ఈ మధ్య చాలాసార్లు కనిపించింది..." చెప్పాడు డ్రైవర్.

అయిదుగురు అమ్మాయిలు ఒకరి మొహం మరొకరు చూసుకున్నారు.

"కొద్దిగా లారీని రోడ్డు పక్కన ఆపుతావా?" అంది కాంచనమాల.

"ఇక్కడ ఎందుకమ్మా?"

"ఆడవాళ్ళను ఎక్కించుకున్నాక ఇలాంటివి తప్పవు. ప్రతి ప్రశ్నకు సమాధానం చెప్పలేము. వెంటనే ఆపు..." అంది ఆమె.

విసుక్కుంటూనే ఆపిన డ్రైవర్, "దిగండి..." అన్నాడు.

"లారీ ఆపింది మేము దిగటానికి కాదు. కాసేపు నువు దిగు. మేం మాట్లాడుకోవాలి..." అంది మధుబాల.

వాళ్ళు ఇచ్చిన డబ్బులు కళ్ళ ముందు కనపడటంతో ఏమీ అనలేక లారీ డ్రైవర్ కిందకు దిగి కొద్దిగా దూరంగా వెళ్ళి ఒక బీడీ వెలిగించుకున్నాడు.

"ఇప్పుడు చెప్పండి మీ ఉద్దేశం. ఇది ఏమయి ఉంటుంది?" అడిగింది మధుబాల మిగిలిన వారిని.

"అచింత్ కూడా దీని గురించి ఏమీ చెప్పలేదు. మన హెడ్‌క్వార్టర్స్‌కి కూడా ఇక్కడ ఇలాంటి సౌకర్యం ఒకటి ఉందని తెలియదు. మరి ఇంత రహస్యంగా ఏర్పాటు చేసిన ఇది ఏమయి ఉంటుంది?" తను కూడా ప్రశ్నను సంధించింది కాంచనమాల.

"దాని దగ్గరకు వెళ్ళి చూస్తే కానీ ఈ ప్రశ్నలకు జవాబు రాదు..." తన అభిప్రాయం చెప్పింది చేవా.

"కానీ శనివారం కలకత్తా వస్తున్నామని హెడ్‌క్వార్టర్‌కి మెసేజ్ కూడా వెళ్ళిపోయి ఉంటుంది. ఇప్పుడు ఈ లారీ దిగి అటు వెళ్తే కలకత్తా ఎప్పటికి వెళ్ళగలం?" తమ పరిస్థితిని వివరించింది ఫ్లోరెన్స్.

"మరి ఏం చేద్దాం?" అంది చేవా.

"మనం రెండు గ్రూపులుగా విడిపోదాం. నేను దీని అంతు తేల్చటానికి వెళ్తాను. నాతో ఎవరయినా వస్తారా?" అడిగింది కాంచనమాల.

"నేను వస్తాను..." అంది చేవా.

"మీ ఇద్దరు ప్రయాణం కంటిన్యూ చేయండి. నేను, చేవా ఇక్కడ దిగిపోతాం..." అంతిమ నిర్ణయం తీసుకున్నట్లు అంది కాంచనమాల.

"కానీ, ఇలా ఒంటరిగా ప్రమాదంలోకి వెళ్ళటం..." అంటూ ఏదో చెప్పబోయింది మధుబాల.

మధ్యలోనే నిలువరించింది కాంచనమాల. "మనందరి లక్ష్యం ఒకటే. మనం అనుకున్న పనిని అనుకున్న విధంగా పూర్తి చేయాలంటే ఏది సులువయిన మార్గం అయితే దాన్ని ఎంచుకోవాలి. అంతే కానీ ఏది క్షేమం అయితే దాన్ని ఎంచుకోవటం కాదు. మా గురించి ఆలోచించ వద్దు. మేం అక్కడ కనిపెట్టిన విషయాలను, పావురాల ద్వారా కోహిమా చేరుస్తాం. బ్రతికుంటే అందరం కోహిమాలో కలుసుకుందాం..." అంటూ లారీ నుండి కిందకు దిగింది ఆమె. ఆమెను అనుసరించింది చేవా.

కాసేపటి తరువాత లారీ దగ్గరకు వచ్చిన డ్రైవర్‌కు అందులో ఇద్దరే కనిపించారు. మిగిలిన ఇద్దరు ఏమయ్యారు అని అడగబోయి, ఎదుటి వారి మొహాల్లో కనిపిస్తున్న సీరియస్‌నెస్ చూసి తమ మాటలను మనసులోనే అణచుకున్నాడు.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS